ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శనివారం | 07 జూన్ , 2025 | పేజీలు : 06


## నూతన వధూవరులను ఆశీర్వదించిన సిపిఐ నాయకులు

ప్రజాపక్షం/డిండి : డిండి మండలం జాల్ తండాకు చెందిన రమావత్ బిక్యనాయక్ కొడుకు కేశ్యనాయక్ కూతురు వివాహానికి సిపిఐ జాతీయ నాయకులు, మాజీ ఎంఎల్ఏ పల్లా వెంకట్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహా వేడుకల్లో పల్లా వెంకట్‌రెడ్డి వెంట నల్గొండ సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు మైనోద్దిన్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తూం బుచ్చిరెడ్డిలు పాల్గొన్నారు.



## అది బిఆర్ఎస్ కాదు...

# దెయ్యాల రాష్ట్ర సమితి





ఆలేరు నియోజకవర్గంలో రూ.1500 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సిఎం రేవంత్‌రెడ్డి

సిఎంకు జ్ఞాపికను అందజేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

వివరాలు మెయిన్‌లో

### వంద పడకల ఆసుపత్రిలో...

## రోగులు ఫుల్.... సౌకర్యాలు నిల్!

కొరవడిన పర్యవేక్షణ లోపం..

అధికారులు వచ్చినప్పుడే హడావిడి...



5

## నేత్రదానంపై ప్రజలలో పెరుగుతున్న అవగాహన



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** నేత్రదానంపై ప్రజలలో అవగాహన పెరగడంతో అన్ని విధాలుగా సహకరిస్తున్నారని లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ ఐ డొనేషన్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హరనాథ్ తెలిపారు. పట్టణంలోని శివాజీ నగర్ ప్రాంతానికి చెందిన మారోజు కౌసల్య శుక్రవారం స్వర్గస్తులైయ్యారు. వీరి కుమారులు భీష్మ కుమార్, విశ్వవిజయ్ కుమార్‌ల అంగీకరించడంతో నేత్రదానాన్ని స్వీకరించారు. అదేవిధంగా పద్మావతి కాలనీ చెందిన కొప్పరపు వెంకట రాయ శర్మ మృతి చెందారు.వీరి కుమారుడు కొప్పరపు బుచ్చిరామయ్య,కోడలు అంజనీదేవి లను సంప్రదించి మరణానంతర నేత్రదాన ప్రాముఖ్యతను వివరించగా వారు అంగీకారంతో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ చారిటబుల్ ట్రస్ట్ ఐ డొనేషన్ సెంటర్ టెక్నీషియన్ బచ్చలకూర జానీ, మేనేజర్ డాక్టర్ పుల్లారావుల చే నేత్రదాన సేకరణ చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఐ డొనేషన్ సెంటర్, సభ్యులు డాక్టర్ ప్రనూష, డాక్టర్ నితిషా, ఏచూరి శైలజ, ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ దామొర యాదయ్య, కార్యదర్శి,డాక్టర్ కొనకంచి విజయకుమార్, కోశాధికారి,డాక్టర్ ఎం. ప్రవీణ్,వేముల సాయికుమార్, పిచ్చయ్య, అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

## కంపు కొడుతున్న మరుగుదొడ్లు..

భరించలేని వాసన ఇబ్బంది పడుతున్న పోలీస్ సిబ్బంది

జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో శుభ్రంగా లేని మరుగుదొడ్లు



5




## పరిశుభ్రతతోనే ఆరోగ్యం

**ప్రజాపక్షం/కోదాడ:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా జీవిస్తామని కోదాడ మున్సిపల్ కమిషనర్ రమాదేవి అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని కొమరబండ 10వ వార్డులో వందరోజుల కార్యచరణ అమలులో భాగంగా స్థానికులకు పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. సింగిల్‌యూస్ ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. అనంతరం పారిశుద్ధ్య సిబ్బందికి స్థానికులకు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీముఖి, ఎస్ఐ సురేష్, సాయికృష్ణ, రాజయ్య, ఏఎన్ఎం నీరజ, ఆశ వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ఇందిరమ్మ ఇళ్ల మంజూరి పత్రాల పంపిణీ

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : తెలంగాణలో అధికారాన్ని కైవసం చేసుకుని రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన అత్యంత ప్రతిష్టాత్మకమైన హామీలలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అమలులో అనేక కసరత్తుల చేసిన తర్వాత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిచేసుకుని లబ్ధిదారులకు ఇళ్ల మంజూరీ పత్రాలను అందజేయడంలో భాగంగా పోచంపల్లి మండలంలోని నిరుపేద ఇల్లు లేని లబ్ధిదారులకు నేడు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిచే ఇందిరమ్మ ఇళ్ల మంజూరీ పత్రాల పంపిణీ కార్యక్రమం పోచంపల్లి లోని సాయి బాలాజీ ఫంక్షన్ హాలులో మధ్యాహ్నం మూడు గంటలకు జరగనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాపర్తి భాస్కర్, మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి సంయుక్త ప్రకటనలో శుక్రవారం తెలిపారు. మున్సిపాలిటీ మండల వ్యాప్తంగా ఉన్న లబ్ధిదారులు ప్రజలు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా ఆయన కోరారు.

## రాయినిపాలెంలో బడిబాట

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలోని రాయినిపాలెం మండల పరిషత్ ప్రాథమికొన్న పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్మన్ మంద రజిత, కాంగ్రెస్ జిల్లా స్టార్ కంపైనర్ పోలగాని వెంకటేష్‌గౌడ్‌లు పాల్గొన్నారు. సందర్భంగా వెంకటేష్‌గౌడ్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కాకునూరి విజయ్ మాట్లాడుతూ రాయినిపాలెం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సాయంత్రం సమయంలో హోంవర్క్‌లో ఒక వాలింగర్‌ను తన సొంత డబ్బులతో ఏర్పాటు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రంజిత్, బోడ వెంకన్న, చిలకల సతీష్, కాకునూరి కృష్ణగౌడ్, గ్రామ కార్యదర్శి రమణ, అంగన్‌వాడి టీచర్ అరుణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు అందించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** తడి, పోడి చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం దురాజ్‌పల్లిలో ప్రజలకు జరిగిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. తడి, పోడి చెత్తను సెగ్రిగేషన్ చేసి (వేరుచేయు విధానంపై) గృహయాజమానులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు 100 రోజుల ప్రణాళికను అమలు చేస్తుందని,ఈ ప్రణాళికలో బాగంగా నిర్దేశించిన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వీధులలో సంచరించే కుక్కలపై ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్న పిల్లలను కుక్కలకు దూరంగా ఉండేలా చూడాలన్నారు. పెంపుడు కుక్కలను టీకాలు వేయించాల అన్నారు. వార్డులలో నీటి సరఫరాకు సంబంధించి క్లోరినేషన్ టెస్టులు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ సత్యారావు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ సారుగండ్ల శ్రీనివాస్, ఎఇ తిరుమల్లయ్య, యాదగిరి, శ్వేత, శివప్రసాద్, వార్డు అధికారులు, ప్రజలు, సివోలు, ఆర్పీలు, మహిళ సంఘాలు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ లైసెన్స్ తప్పనిసరి తీసుకోవాలి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** పోచంపల్లి పట్టణ మున్సిపాలిటీ పరిధిలో నడుపుతున్న వృత్తి వ్యాపార యజమానులు తప్పనిసరిగా మున్సిపాలిటీ లైసెన్స్ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ డి.అంజన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో దుకాణం దారులకు నోటీసులు జారీ చేశారు. 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వృత్తి వ్యాపార లైసెన్స్ లేని షాపు యజమానుదారులకు లైసెన్స్ తీసుకొనవలసిందిగా ఆయన నోటీసులు ఇచ్చారు. వినోభా మందిరం వద్ద ఏర్పాటు చేసిన సమావేశములో అసిస్టెంట్ డైరెక్టర్ జ్యోష్ణతో కలిసి తడి పొడి చెత్త సేకరణ, వీధి కుక్కల నుండి ఎలా రక్షించుకోవాలో మహిళ సంఘ సభ్యులకు అవగాహన కార్యక్రమము నిర్వహించారు. మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులు తమ ఇంటి నుండి ఏర్పడే చెత్తను వేరుగా చేసి తడి చెత్తను ఇంటి ఆవరణలోనే సేంద్రీయ ఎరువుగా తయారు చేయడం లాంటి మెళుకువలను వివరించారు. ఎవరు కూడా చెత్తను వీదుల వెంట వేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్లాస్టిక్ కవర్ల వాడకమును తగ్గించాలని మహిళా సంఘ సభ్యులను కోరారు. ఈ కార్యక్రమములో మునిసిపల్ మేనేజర్ ఎన్ నిర్మల, వార్డ్ ఆఫీసర్లు, మెప్మా సిబ్బంది, మహిళా సంఘ సభ్యులు, పారిశుద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/మునగాల:** భూ భారతి రెవిన్య సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోదాడ ఆర్డీవో సూర్యానారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన భూభారతి రెవిన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. బరాఖత్‌గూడెం లో నిర్వహించిన సదస్సులో 100 దరఖాస్తులు వచ్చినట్లు తహసిల్దార్ రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రామకృష్ణారెడ్డి, ఆర్ఐ రామారావు, నాయకులు కాలే సామ్యేలు, రణబోతు వీరారెడ్డి, రామిరెడ్డి, పాషా, సీనియర్ అసిస్టెంట్ స్వప్న, జూనియర్ అసిస్టెంట్లు సునిల్ గవాస్కర్, సాయి, ప్రశాంత్ పాల్గొన్నారు. బడిబాట కార్యక్రమ పోస్టర్‌ను కోదాడ ఆర్డీవో సూర్యానారాయణ ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య దొరుకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బరాఖత్‌గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దీపదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులతో భూభారతి ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని పోచంపల్లి తహసిల్దారు శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మండల వ్యాప్తంగా జిబ్లక్‌పల్లి, జగత్‌పల్లి, మెహర్ నగర్, జలాల్పురం, రేవనపల్లి, పెద్దరావులపల్లిలలో శుక్రవారం హైదర్పూర్, కప్రాయిపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించినట్టు ఆయన తెలిపారు. కప్రాయిపల్లిలో 9 దరఖాస్తులు, హైదర్పూర్లో ఎలాంటి దరఖాస్తులు రాలేదని వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గుత్తా వెంకటరెడ్డి సర్వేయర్ సాయి గ్రామస్తులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/చండూరు:** భూ సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం రెవిస్యూ సదస్సులను నిర్వహిస్తుందని భూ సమస్య ఉన్న ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చండూరు మండల డిప్యూటీ తహసీల్ధార్ నిర్మల అన్నారు. భూభారతి చట్టం అమలులో భాగంగా శుక్రవారం కస్తాల గ్రామంలో రెవిన్యూ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల గిర్దావరు శేఖర్ ,రెవిన్యూ సిబ్బంది , ఎఫ్ఎస్‌సిఎస్ డైరెక్టర్ కట్ట భిక్షం , రైతులు రమేష్ , కట్ట వెంకన్న , రమేష్ పాల్గొన్నారు.



## ముస్లిం సోదరులకు ఎలాంటి అసౌకర్యాలు కలగొద్దు

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ముస్లీం సోదరులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జనగాం రోడ్డు వెళ్లే సమీపంలోని బక్రీద్ సందర్భంగా ఈద్గాను పరిశీలించి మున్సిపల్ అధికారులకు, పోలీసులకు పలు సూచనలు చేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా ప్రత్యేక పార్థనల కోసం ఈద్గాకు వచ్చే ముస్లీంలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి ముస్లీం మతపెద్దల సలహాలతో రూట్ మ్యాప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సూర్యాపేట పట్టణం నుంచి పొట్టి శ్రీరాములు సెంటర్, పోస్టాఫీస్, కోర్టు చౌరస్తా, ఎస్వీ కాలేజీ గుండా ఈద్గాకు వెళ్లి ప్రార్థన అనంతరం అంజనిపురి కాలనీ నుండి తిరిగి వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, ఎస్ఐ అంజనేయులు, మున్సిపల్ శానిటరి ఇన్స్‌పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అంజద్అలీ, మాజీ కౌన్సిలర్ గండూరి రమేష్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య




**ప్రజాపక్షం/కోదాడ:** ప్రభుత్వ బడిలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామని కోదాడ మండల విద్యాధికారి సలీంసరిఫ్ అన్నారు. శుక్రవారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యతో విద్యార్థులు సంపూర్ణ వికాసం జరుగుతుందని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కంప్యూటర్ విద్యను అందిస్తున్నామని తెలిపారు.చదువుతో పాటు విద్యార్థుల ప్రవర్తన సంస్కారంపై దృష్టి పెట్టాలని, ఈనెల 6 నుండి 19వ తేదీ వరకు ప్రత్యేకంగా అడ్మిషన్ల కోసం బడిబాట ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెరువుకట్ట బజార్‌లో, ముస్లీం బజార్‌లో ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులకు వివరించి పిల్లల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మార్కేండేయ, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ, కనకమ్మ, పాండురంగాచారి, ఖాజామియా, జానకిరామ్, కె.రవి, అశోక్ పాల్గొన్నారు.

## కొండాపురంలో బడిబాట

**ప్రజాపక్షం/చండూరు:** ఎంపీ యుపిఎస్ కొండాపురం బడిబాటలో భాగంగా శుక్రవారం పాత గ్రామ పంచాయితీ సెంటర్‌లో గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూతం ముత్యాలు, పంచాయితీ కార్యదర్శి పాండురంగం పాల్గొని మాట్లాడుతూ మనబడి మన చదువుల గుడి అని నినాదం చేస్తూ గ్రామ ఆవాసంలోని ప్రథమికోన్నత పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని అన్నారు. ప్రైవేటు పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ బడులు ఉన్నాయని మంచి నాణ్యమైన విద్యను అందిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం విద్యార్థులకు కావలసిన అన్ని వసతులను కల్పిస్తున్నందున విద్యార్థులను ప్రభుత్వ బడులలోనే చేర్పించి బలోపేతం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భద్రయ్య , భగవంతు రెడ్డి , పావని,ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.



# భక్తికి, త్యాగానికి, సహనానికి ప్రతీక బక్రీద్

**మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు**



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** భక్తికి, త్యాగానికి, సహనానికి ప్రతీక బక్రీద్ అని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు అన్నారు. ఈనెల 7న బక్రీద్ సందర్భంగా ఆయన శుక్రవారం ముస్లీం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. భక్తి శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలని ఆయన సూచించారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ముస్లీంలు బక్రీద్ పండుగను జరుపుకుంటారని అన్నారు. పేదల పట్ల జాలి, దయ కలిగి ఉండడమే బక్రీద్ ఇచ్చే సందేశమన్నారు. అల్లా ఆశీస్సులు ప్రజలందరికి ఎల్లప్పుడు ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

# గుమ్మడవెల్లి గ్రామంలో 10 మేకలు చోరీ



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల పరిధిలోని గుమ్మడవెల్లి గ్రామంలో 10 మేకలు చోరి జరిగిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఎస్‌కే. షరిఫ్ బీ మేకలను పెంచుకుంటూ జీవనం కొనసాగిస్తుంది. రోజు మాదిరిగానే మేకలను పోలంలో మేపుకొని వచ్చి గురువారం సాయంత్రం ఊర్లో తన ఇంటి వద్ద ఉన్నటువంటి మేకల దొడ్డిలో 50 మేకలను కట్టేసి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొడ్డిలో చొరబడి సుమారు లక్ష విలువ చేసేటటువంటి 10 మేకలను ఎత్తుకెళ్ళినట్లు ఆమె తెలిపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజ్మీర రమేష్ తెలిపారు.

# దైవ చింతనతో మానసిక ప్రశాంతత

**ప్రజాపక్షం/డిండి;** డిండి మండలం సింగరాజుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన తృతీయ బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఏ రమావత్ రవీంద్రకుమార్ ముఖ్య అతిధిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ గ్రామ సంస్కృతికి ప్రతిబింబం నాభిశిల ఉత్సవం అని, గ్రామ ప్రజలను సంరక్షించే పొలిమేర దేవతలను ఈ సందర్భంగా పూజించుకోవడం శుభదాయకమని అన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్‌ఏ రవీంద్రకుమార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు రాజినేని వెంకటేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ రవీందర్‌రావు, నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరూ భగవంతుని ఆశీస్సులు పొందాలి



**ప్రజాపక్షం/చందంపేట:** నల్గొండ జిల్లా చందంపేట మండలం ప్రతి ఒక్కరు శ్రీశ్రీశ్రీ సీతారాముల, శివాలయ, ఆంజనేయస్వామిల ఆశీస్సులు పొందాలని నల్గొండ జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ ఎ ంఎల్ఏ రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తేల్దేవరపల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ సీతారాముల, శివాలయ, ఆంజనేయస్వామి వార్ల నూతన ఆలయ ప్రారంభోత్సవం మరియు ధ్వజ స్థంభ ప్రతిష్టాపన కార్యక్రమంలో నల్గొండ జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ ఎ ంఎల్ఏ రమావత్ రవీంద్రకుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుత ప్రతి ఒక్కరు దైవ చింతన కలిగి ఉండాలని, దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. అనంతరం ఆలయ కమిటి సభ్యులు మాజీ ఎంఎల్ఏ రవీంద్రకుమార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు లోక్యనాయక్, శ్రీనివాస్‌గౌడ్, శంకర్, మోహన్‌కృష్ణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడుకుందాం



**ప్రజా పక్షం/వేములపల్లి:** ప్రపంచం కోటానుకోట్ల జీవరాసుల నిలయం అని,భూమి చుట్టూ ఆవరించి వున్న గాలి, నీరు, వెలుతురు వంటి అంశాలను పర్యావరంణ అంటారు. పర్యావరణము కాపాడుకోకపోతే జీవరాసుల బతుకే ప్రశ్నర్థకం అవుతుందని,మనిషి మనుగడకు ఆహారపు అలవాట్లు ప్రధాన కారణమని, ఆహారపు అలవాట్లు మార్చుకుంటే ఆయుః ప్రమాణాన్ని పెంచుకొనే అవకాశం ఉందని జన విజ్ఞాన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోలా శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రావుల పెంట గ్రామంలో ఉపాధి హామీ పనులు చేసే వారి వద్దకు వెళ్లి ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, చేతి సంచులను వాడుతూ, మరలా పునరుత్పత్తికి ఉపయోగ పడే, తక్కువ మోతాదులోప్లాస్టిక్ వాడుతూ పర్యావరణ ను కలుషితం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జే వి వి నాయకు పాదురి రమణా రెడ్డి,జే వి వి నాయకులు పారెపల్లి సత్యనారాయణ రావు ఫీల్డ్ అసిస్టెంట్ వల్లపుదాసు సతీష్, మహేష్, ఉపాధి హామీ పథకం సేవకులు పాల్గొన్నారు.

# ఉచిత శిక్షణ శిబిరాలను సద్వినియోగం



**ప్రజాపక్షం/హాలియా:** జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ శిబిరాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ గుండా కృష్ణమూర్తి అన్నారు.గత నెల ఒకటవ తేదీన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హాలియాలో ప్రారంభమైన వేసవి ఉచిత కబడ్డీ శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అనుముల మండల విద్యాధికారి గుండా కృష్ణమూర్తి మాట్లాడుత గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థులను శారీరకంగా,మానసికంగా దృఢంగా చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉచిత కబడ్డీ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు కబడ్డీ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసిన కబడ్డీ కోచ్ శనిగల ఎల్లయ్యను అభినందించారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న 30 మంది విద్యార్థినీ విద్యార్థులకు హాలియాకు చెందిన నల్లగొండ చంద్రయ్య, మంగమ్మ మెమోరియల్ ఫౌండేషన్ చైర్మన్ నల్లగొండ ఆంజనేయులు కబడ్డీ కిట్లను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పిఈడీ వెంకట్రాంరెడ్డి, షేక్ జలీల్, వాడాల వెంకటయ్య, నరందాసు అంజయ్య, షేక్ షరీఫ్ , జానపాటి శ్రీను, నల్లగొండ శ్రీను, పీఈటీలు సురేందర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మహమ్మద్ షహీద్ , ఆవుల చంద్రశేఖర్ యాదవ్ ,లుకేందర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డితదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు



**ప్రజాపక్షం/చిట్యాలః** రాష్ట్రంలో ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాలలో నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. శుక్రవారం రోజున మండలంలోని తాళ్ళవెల్లంల, చిన్నకాపర్తి గ్రామాలలో సదస్సులను నిర్వహించారు. ఆయా గ్రామాలలో వివిధ భూసమస్యలపై రైతులు అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తహసిల్దార్ జి కృష్ణ నాయక్ మాట్లాడుతూ భూ సమస్యలతో సతమతమయ్యే రైతులు వాటి పరిష్కారం కోసం రెవిన్యూ సదస్సులను ఉపయోగించుకోవాలని అన్నారు. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను ఆర్‌డిఓ, కలెక్టర్ కార్యాలయాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని అన్నారు. ఈ నెల 3న ప్రారంభమైన రెవిన్యూ సదస్సులు 12న ముగియనున్నాయి. ఇప్పటి వరకు వట్టిమర్తి, పెద్దకాపర్తి, వనిపాకల, ఏపూర్, ఉరుమడ్ల, పేరేపల్లి, తాళ్ళవెల్లంల, చిన్నకాపర్తి గ్రామాలలో జరిగిన సదస్సులలో రైతుల నుండి 552 దరఖాస్తులు వచ్చాయి. వాటి పరిష్కారం దిశగా రెవిన్యూ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# నేడు సిపిఐ మండల మహాసభ

**ప్రజాపక్షం/వేములపల్లి:** మండల కేంద్రంలో ఈరోజు జరుగుతున్న 7వ మండల మహాసభకు సిపిఐ నాయకులు కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి జిల్లా యాదగిరి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి అధిరథ మహారధులు మాజీ ఎమ్మెల్యే జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం,రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా విచ్చేయుచున్నట్లు తెలిపారు.

# ఘనంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం జన్మదిన వేడుకలు




**ప్రజాపక్షం/మునుగోడు:** సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం జన్మదినం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద సిపిఐ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురజా రామచంద్రం పాల్గొని కేక్ కట్ చేసి,బాణాసంచా కాల్చి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి,మాజీ జెడ్పిటిసి గోస్కొండ లింగయ్య,మండల కార్యవర్గ సభ్యులు ఈదులకంటి కైలాస్,ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి బండారి శంకర్, ఉపాధ్యక్షులు గోస్కొండ మల్లేష్, కట్ట దశరథ,మోకాళ్ళ పరమేశ,బాబి,చాపల శేఖర్, స్వామి ,నరేష్,కురుమూర్తి ముత్తయ్య, రామ్ కుమార్, శివ,రాజు,లింగ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల పరిధిలోని వెల్మజాల గ్రామంలో మొరిగాల ఉపేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి పండ్లు పంపిణి చేసి ఆయన మాట్లాడుతూ ప్రజల మనిషి, ప్రజా బంధు, ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి నేనున్నానంటు ముందుకు వచ్చి ఆర్థికంగా ఆదుకుంటూ మనోధైర్యాన్ని నింపి ప్రజల మనిషిగా పేరుపొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంద రాములు, నాగరాజు, వేణుగోపాల్, శ్రీనివాస్, బాలరాజు, నర్సింహా, ఆంజనేయులు, రమేష్, వెంకటేష్, నాగిరెడ్డి, నర్సింహారెడ్డి, గణేష్, బాలరాజు, బాలనర్సింహా, భాస్కర్, ఎల్లయ్య, వినోద్, మధు, పురుషోత్తం, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బాలభవన్ వేసవి శిక్షణ ముగింపు

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** అదనపు విద్యలను అర్జించడం వల్ల చిన్నారుల భవిష్యత్‌లో ప్రయోజనం చేకూరుతుందని బాలభవన్ అభివృద్ధి కమిటి సభ్యులు డాక్టర్ రామ్మూర్తి అన్నారు. శుక్రవారం జిల్లా బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బాలభవన్ సమ్మర్ క్యాంపు ముగింపు సందర్భంగా విద్యార్థులు పలు ప్రదర్శనలు చేసి ఆశ్చర్యపర్చారు. గానం, సంగీతం, వాయిద్యం, కుట్లు, అల్లికలు, చిత్రలేఖనం, నృత్య పోటీలతో పాటు మెడిటేషన్, సైన్స్ ప్రయోగాలు ప్రదర్శించారు. హమీద్‌ఖాన్, అనంతుల జయమ్మ, బుర్రి వెంకటేశ్వర్లు, పల్లె మణిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించండి



**ప్రజాపక్షం/చిట్యాలః** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం బడి బాట కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించింది. ఈ నెల 19వరకు కొనసాగే ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల పరిధిలోని విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించే విధంగా ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం అందించే ఉచిత పుస్తకాలు, విద్య, ఏకరూప దుస్థులు, మధ్యాహ్న భోజన పథకం లాంటి ఆకర్షణీయ అంశాలతో తల్లిదండ్రుల ముందుకు వెళ్లి వారి పిల్లల ప్రవేశాల కోసం ప్రయత్నిస్తున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం పేరుతో నేడు ఆయా గ్రామాలలో ఉపాధ్యాయులు గ్రామ సభలను నిర్వహించారు. మండలంలోని చిన్నకాపర్తి గ్రామంలో జరిగిన గ్రామ సభలో తహసిల్దార్ జి కృష్ణ నాయక్, మండల విద్యాధికారి సైదానాయక్‌లు పాల్గొని తల్లిదండ్రులనుద్దేశించి మాట్లాడుతూ సుశిక్షితులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని సూచించారు. చిట్యాల మున్సిపాలిటి, గుండ్రాంపల్లి, వెలిమినేడు గ్రామాలలో జరిగిన బడిబాట కార్యక్రమాలలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గోగికార్ మాధవి, ఏరెడ్ల వెంకట్‌రెడ్డి, యానాల నర్సిరెడ్డి, వెలిమినేడు పిపిసిఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** విద్యార్థులకు నాణ్యమైన బోధన చేసి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఎంఈవో ఆర్. నాగేశ్వర్‌రావు ఉపాధ్యాయులకు సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక జెడ్పిహెచ్‌ఎస్‌లో గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డాకునాయక్, కెజిబివి ఎస్‌వో సరళ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉదయ, సీనియర్ ఉపాధ్యాయుడు మల్లేల జనార్ధన్‌రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, బక్క శ్రీనివాస్‌చారి, శివప్రసాద్‌రెడ్డి, జానునాయక్, సైదానాయక్, అశోక్, అంజయ్య, నీరజ, సరస్వతి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/డిండి;** మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆకుతోటపల్లి గ్రామంలో 2025/2026 విద్యా సంవత్సరంలో భాగంగా బడిని బలోపేతం చేయడంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఊర్లో ర్యాలీ నిర్వహించి గ్రామ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కొమ్మేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి ఉత్తమ పౌరులను అందించే గొప్ప కర్మాగారం ప్రభుత్వ బడులని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆర్టిస్టు ఇండియన్ ఆర్ట్స్ జీవా, గ్రామ పెద్దలు ఉప్పుగంటి అంజల్‌రావు, నారాయణరావు, సురేందర్‌రావు, బాబురావు, విద్యార్థులు తల్లి దండ్రులు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/గుండాల;** ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులను చేర్పించాలని గుండాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు గంధం చంద్రకళ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గుండాల మండల కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలరాజు, రామకృష్ణ, రవి, కృష్ణయ్య, కృష్ణవేణి, గంగాభవాని, కవిత, మాజీ ఎంపిటిసి రామచంద్రయ్య, హరికృష్ణ, ఉష పాల్గొన్నారు.





**ప్రజాపక్షం/వేములపల్లి:** చదువుకునే విద్యార్థిని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని వేములపల్లి మండల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులతో కలిసి శుక్రవారం స్థానిక గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలికాంత రెడ్డి,మాజీ సర్పంచ్ చిర్ర మల్లయ్య, నాగవెల్లి మధు, జడ రాములు , పుట్టల గోపయ్య పుట్టల శ్రీనివాస్,గిరి,పుట్టల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/దామరచర్ల:** బడి వీడు పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పాఠశాలను బలోపేతం చేయాలని అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ధీరావత్ బుజ్జి లింగ నాయక్ అన్నారు. బడిబాట కార్యక్రమాన్ని పాఠశాల అవరణలో గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా లింగ నాయక్ మాట్లాడుతూ పభుత్వం పాఠశాలలను బలోపేతం చేయాలని అన్ని గ్రామాల్లో బడి బాట కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి విజయ్,ఉపాధ్యాయులు ఆశా వర్కర్లు అంగన్వాడీ టీచర్లు విద్యార్థులు పాల్గొన్నారు.



## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ భారతి చట్టం 2025, రెవెన్యూ సదస్సులను భూ సమస్యలు గల రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఆర్డివో ఎస్. రమణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని దోనియాల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరై రైతులు ఇచ్చిన దరఖాస్తులను స్వయంగా స్వీకరించారు. దోనియాల రెవెన్యూ గ్రామంలో 4 దరఖాస్తులు, వర్ధమానుగూడెం రెవెన్యూ గ్రామంలో జరిగిన సదస్సులో 6 దరఖాస్తులు మొత్తం 10 దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దార్ నరేందర్ పేర్కొన్నారు. ఈ సదస్సులలో నయాబ్ తహశీల్దార్ ప్రశాంత్, ఎంఆర్‌ఏ ఓర్సు శ్రీనివాస్, ఏఆర్ఐ ఐశ్వర్యరెడ్డి, సినియర్ అసిస్టెంట్ దయాకర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు శ్రీనివాస్, సుష్మ, సంగీత, కవిత, విఆర్‌ఏలు రామకృష్ణ, మహబూబ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపకార వేతనాలు చెల్లించాలి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫిజు రియంబర్స్‌మెంట్‌లను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆల్ ఇండియా స్టూడెంట్ సోషల్ సర్వీస్ దేవరకొండ నియోజకవర్గ నాయకుడు రమావత్ వినోద్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వినోద్‌నాయక్ మాట్లాడుతూ సుమారు 8వేల కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్‌లు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఉపకార వేతనాలు అందకపోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఘనంగా ప్రభుత్వ విప్ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** మండలంలోని సోలిపేట గ్రామంలో ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ బీర్ల ఐలయ్య జన్మదిన వేడుకలను గ్రామ శాఖ అధ్యక్షులు తాళ్ల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామపంచాయతీ సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు రాజేశ్వర్ యాదవ్, మాజీ సర్పంచ్ రెడ్డి నాయక్, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, ఆంజనేయులు గౌడ్, బాబు, ధీరావత్ స్వామి నాయక్, గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌విటికి శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/దేవరకొండ;** ఎస్‌బిఐ ఓబిసి వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా నియమించబడిన ఎన్‌విటికి ఆఫీసర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఆంజనేయ ప్రసాద్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాప్ యూనియన్ హైదరాబాద్ సర్కిల్ జనరల్ సెక్రటరీ శాండిల్య, యూఎఫ్‌బియూ కన్వీనర్, ఎస్‌బిఐ, ఎన్‌సీబిఈ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్, ఎస్సీ, ఎస్టి వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అధ్యక్షులు భార్గవ్, సూర్యంలు కలిసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



## ఆశా డే ప్రోగ్రాం

**ప్రజాపక్షం/ మానవపాడు :** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం మానవపాడు మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్।। హేమమానస సమక్షములో శుక్రవారం ఆశ డే మీటింగ్ నిర్వహించి అన్ని ప్రోగ్రాం పై ప్రక్షాళన చేస్తూ గర్భిణీ స్త్రీ లను ఎర్లీ రిజిస్ట్రేషన్ రక్త హీనతకు గురి కాకుండా ఐరన్ మాత్రలు ఇవ్వడం గర్నమెంట్ హాస్పిటర్ కాన్పులు కావాలి, టీమి అనుమానిత వారికి స్పుటం తీసుకుని పరీక్షలు చేయించాలి అని, సీజనల్ వ్యాధుల అవగాహన కల్పించి అన్ని ప్రోగ్రామ్స్ లో 100 % శాతము నివేదికలు సాధించాలి అని తగు సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్।। హేమ , మానస, హెలెన్, ఒబేదుల్ల, చంద్రన్న, అశ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం

**ప్రజాపక్షం/మానవపాడుః** అలంపూర్ నియోజకవర్గం మానవపాడు మండల కేంద్రంలోని బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అందరూ పాఠశాలలో విద్యార్థులను చేర్పించండి అంటు గ్రామంలో ఉన్న వీధివాడలు తిరుగుతు అంగన్ వాడీ కేంద్రాలను సందర్శించి ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలను ఎంపీపీఎస్ మానవపాడు మెయిన్ కు పంపాలని విద్యార్థుల తల్లిందండ్రులను, అంగన్ వాడీ టీచర్లను కోరడం జరిగిందన్నారు. ఉపాధ్యాయులు కోరిన అనంతరం ఈ గ్రామ పంచాయతీ ఆఫీస్ సమీపంలో ఉన్న అంగన్ వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రామ సభను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ గ్రామసభలో హెచ్‌ఎం వెంకటేష్ మాట్లాడుతూ 6వ తరగతి నుండి 10 వ తరగతి వరకు మానవపాడు హైస్కూల్లో చేర్పించాలని రామ్మూర్తి తెలిపారు. అదే విధంగా ఉర్దూ మీడియంలో 1 నుండి 7 వ తరగతి వరకు ఇదే గ్రామంలో ఉన్న ఉర్దూ పాఠశాలలో మీ పిల్లలను చేర్పించాలని పిల్లల తల్లిదండ్రులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్‌ఎస్ మానవపాడు ఇంచార్జ్ ప్రధానోఉపాధ్యాయులు రామూర్తి , ఎంపీపీఎస్ వెంకటేష్, ఎంపీయుపిఎస్ ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం రుమానా పర్వీన్, ఉపాధ్యాయులు ఇక్బాల్, రామేశ్వర్ రెడ్డి, విజయమ్మ, శ్రీలేఖ, అంగన్ వాడీ టీచర్ శ్రీలత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/ ఉండవెల్లి :** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం బడి ఈడు పిల్లలు బడిలో చేర్పించేందుకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమ ద్వారా అంగన్వాడి సెంటర్లో గ్రామసభ నిర్వహించి పిల్లల్ని బడిలో చేర్పించాలని అంగన్వాడి టీచర్లను తల్లిదండ్రుల కు అవగాహన నిర్వహించారు. శుక్రవారం నుంచి 19 తేదీ వరకు రోజు వారీగా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆయా పాఠశాలలోని ఉపాధ్యాయులు , ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మండల విధ్యాధికారి రామకృష్ణ తెలిపారు.

# రోగులు ఫుల్.... సౌకర్యాలు నిల్!

**ప్రజాపక్షం/నందికొండ:** నిత్యం వైద్యం కోసం వందల మంది రోగులు అవుట్ పేషంట్ గా 300 మంది ఇన్ పేషంట్ గా 40 మంది రోగులు స్థానిక కమలా నెహ్రుప్రభుత్వ ఆసుపత్రికి వస్తుఉంటారు అక్కడ వారికి సరైన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రిలో పర్యవేక్షణలోపం రోగులకు శాపంగా మారుతోంది కోట్లరూపాయలతో నిర్మించిన ఆసుపత్రి భవనం రంగు, హంగులతో చూడడానికి ఇంద్రభవనంలా ఒక కార్పొరేట్ ఆసుపత్రి ని తలపించినా లోపల మాత్రం కనీస సౌకర్యాలు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైన పటారం లోనలొటారం అన్నచందంగా ఆసుపత్రి పరిస్థితి తయారయింది. ఆసుపత్రిని ప్రారంభించి సంవత్సరాలు గడుస్తున్నా వాటిలో మౌలిక సదుపాయాలు ఉండవు.

**పనిచేయని లిఫ్ట్ తో రోగుల తిప్పలు...**

ముఖ్యంగా అత్యవసర చికిత్సనిమిత్తం ఆసుపత్రికి వచ్చిన రోగులు రెండు అంతస్తులు పైన ఉన్న మెడికల్ వార్డుకు చేరుకోవాలంటే

అది బహుళ అంతస్తు భవనం కావడంతో లిఫ్ట్ మార్గాన్ని అనుసరించాలి. కానీ ఆ లిఫ్ట్ మాత్రం ఎప్పుడూ పనిచేయదు. కనీస మరమ్మతులు చేయాలన్న ధ్యాస కూడా అధికారులకు ఉండదు ఎప్పుడో ఒకసారి పని చేసినా కరెంటు



పనిచేయని లిఫ్ట్

పోతే ఇక అంతే సంగతులు.

కరెంటు వచ్చేవరకు ఆ లిఫ్టులోనే రోగులు ఉండాలి ఈలోపు రోగి ప్రాణాలు పోయినా ఆశ్చర్యం లేదు ఆసుపత్రికి హెవీ జనరేటర్ సదుపాయం ఉన్నా దానిని అత్యవసర సేవలకు అంటే కరెంటు పోయినప్పుడు మెడికల్ వార్డులో రోగుల సౌకర్యార్థం కానీ లిఫ్ట్ కొరకు వినియోగించాలి అలా కాకుండా అధికారులు, ఆసుపత్రి సిబ్బంది గదుల్లో ఫ్యాన్లు, కూలర్లు తిరగటానికి మాత్రం ఉపయోగిస్తారు.

**పర్యవేక్షణ లోపం..** ఆసుపత్రిలో పర్యవేక్షణ లోపం రోగులకు శాపంగా మారింది. ఆసుపత్రిలో డాక్టర్లు ఉన్నా ఆసుపత్రిని పర్యవేక్షించడంలో లోపాలు తలెత్తుతున్నాయి.ఆసుపత్రిని ఆధునీకరించినా పరిస్థితి మారడం లేదు. ఆసుపత్రిలో సరైన, మంచినీటి సౌకర్యం లేకపోవడంతో రోగులు, వారి అటెండెంట్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెడికల్ వార్డుల్లో ఫ్యాన్లు తిరగకపోవడం పేషంట్ల కోసం కూలర్లు ఉన్నావాటిని ఉపయోగించకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. ఉదయం 9 గం టల నుంచి 12గంటల వరకు మాత్రమే ఓపీని చూస్తూ వైద్యులు వెళ్లిపోతున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి వేళలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఎమర్జెన్సీ కేసులు చూసే వారు లేకుండాపోయారు.అత్యవసర కేసులు, ఆపరేషన్ల నిర్వహణ చేయాల్సివస్తే సరైన డాక్టర్లు ఉండరు అరకొరా డాక్టర్లు ఉన్నారోగులను పర్యవేక్షించిన దాఖలాలు ఉండవు.దీనితో వార్డు బాయ్ లు, స్వీపర్లు, చికిత్స చేయాల్సి వస్తుంది దీనితో రోగికి సరైన వైద్యం లభించక ప్రథమ చికిత్స చేసి జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారు. ముఖ్య అధికారి గాని, కలెక్టర్ గాని తనిఖీకి వచ్చి నపుడు మాత్రమే హడావిడి చేస్తారు వారు వెళ్లి పోగానే మళ్ళీ మాములే అత్యవసర కేసులు, ఆపరేషన్లు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# కంపుకొడుతున్న మరుగుదొడ్లు..

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** కంపు కొడుతున్న మురుగుదొడ్లు..భరించలేని వాసన ఇబ్బంది పడుతున్న ప్రజలు, పోలీస్ సిబ్బంది..ఇది అంత నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేక భరించలేని వాసనతో పోలీసు సిబ్బందితోపాటు అక్కడికి వచ్చిన బాధితులు కూడా బాత్రూం వెళ్లాలంటే భయపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లకు హెడ్ కోటర్ గా ఉన్న జిల్లా పోలీస్ కార్యాలయంలో పరిశుభ్రత పాటించకపోతే మిగతా పోలీస్ స్టేషన్ల లో పరిస్థితి ఏ విధంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. నిత్యం వందలాది మంది బాధితులు,పోలీసు సిబ్బంది హెడ్ క్వార్టర్ కు వస్తు పోతుంటారు. ఇలాంటి పరిస్థితులలో పోలీస్ కార్యాలయ ఆవరణలోని పరిసరాలు అన్ని పరిశుభ్రంగా ఉండాలి, పరిశుభ్రతపై ప్రభుత్వాలు స్వచ్ఛంద సంస్థలు నిత్యం ఏదో ఒకచోట ప్రజలను చైతన్యం చేస్తూ మన చుట్టుపక్కల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తుంటారు. కానీ వాటిని ఆచరణలో అమలు చేయడంలో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు. దీనికి ఉదాహరనే జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఉన్న



మురుగుదొడ్ల పరిస్థితి స్పష్టంగా కనబడుతుంది. ఈ మురుగుదొడ్ల పరిస్థితి చూస్తుంటే బిత్తిర పోవాల్సిందే అక్కడ బాత్రూంకి వెళ్తే ముక్కు మూసుకొని వెళ్లాల్సిందే. లేదంటే భరించలేని వాసనతో ఉక్కిరిబిక్కిరి కావాల్సిందే. జిల్లాలోని అన్ని విభాగాలకు ఆదర్శంగా ఉండాల్సిన కార్యాలయంలో మురుగుదొడ్ల ను ఎప్పటికప్పుడు క్లీన్ చేయకపోవడంతో అక్కడ మరకలు అంటుగట్టుకొని ఉన్నాయి. టాయిలెట్ రూమ్ లో నుండి లీకేజీ అయి భరించలేని వాసన వెదజల్లుతుంది. మురుగుదొడ్లలోకి వెళ్లి చూస్తే ఎక్కడి మరకలు అక్కడే ఎక్కడ పాశు అక్కడే ఉన్నది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పో లీస్ కార్యాలయ ఆవరణలో ఉన్న మురుగుదొడ్లను పరిశుభ్రంగా చేయించి రోగాల బారి నుండి కాపాడాలని పలువురు కోరుతున్నారు.

## మంత్రి పొంగులేటిని కలిసిన కాంగ్రెస్ నేతలు



**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని తల్లంపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేతలు హైదరాబాద్‌లో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు సమస్యలను పరిష్కరించాలని మంత్రికి మర్యాదపూర్వకంగా విన్నవించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమ్మరి అంబేద్కర్, సోమనబోయిన సత్యానారాయణ, లింగయ్య, భారీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల నమోదు పెంచాలి




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు కృషి చేయాలని రఘునాథపాలెం మండల విద్యాశాఖాధికారి రాములు తెలిపారు. ప్రొ॥ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రఘునాథపాలెం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎం. వెంకటేశ్వర్లు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈసభలో ఎంఈవో రాములు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న వసతులు, విద్యా విధానం గురించి తల్లి దండ్రుల గురించి అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల నమోదును పెంచేందుకు గ్రామ పంచాయతీ అధికారులు, గ్రామ సమాఖ్య సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనురాధ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, కమ్యూనిటీ కో ఆర్డినేటర్ జ్యోతి, ఎల్ఎఫ్ఎల్ హెడ్ మాస్టర్ రాధారుక్మిణి, ఏపిపిసి ఛైర్మెన్లు, సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా రఘునాథపాలెం మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.

## హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేష్‌ను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ శుక్రవారం ఐటిసి పిఎస్‌పిడి అతిధి గృహంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఇక్కడి వచ్చిన ఆయనను కలుసుకున్న కలెక్టర్ పూలమొక్కను అందించి ఆహ్వానం పలికారు.

## ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/ఖమ్మం:** ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని మంద్రాజుపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తొర్తి గురవయ్య సూచించారు. మండలం లోని మంద్రాజుపల్లిలో శుక్రవారం ఇంటిం టా ప్రచారం నిర్వహించారు. ప్రభు త్వం అందించే ప్రోత్సాహం తో ఉన్నత చదవులు చదవాలని ఆకాంక్షించారు. ఉచితంగా దుస్తులు, పుస్తకాలతో పాటు మధ్యాహ్నం భోజనం ను అందిస్తున్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన ఉంటుందని అన్నారు. ప్రవేట్ వద్దు... ప్రభుత్వ పాఠశాల ముద్దు అనే నినాదంతో ప్రతీ ఒక్కరూ పాఠశాలలో చేరాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగులుమీరా, అంగన్వాడీ టీచర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## బ్రెయిన్‌స్ట్రోక్ బాధితురాలికి సిపిఐ చేయూత

**ప్రజాపక్షం/ఖమ్మం :** మండల పరిధిలోని 21ఏరియాలో బియ్యాని రమేశ్ భార్య లావణ్యకు బ్రెయిన్‌స్ట్రోక్ గురి అయిన నేపథ్యంలో వైద్యచికిత్సకై సీపీఐ ఆధ్వర్యంలో రూ.12వేలు ఆర్థిక సాయం చేసి ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని కోరారు.

## కాంగ్రెస్ హయాంలోనే పేదలకు సొంత ఇల్లు



**ప్రజాపక్షం/ఖమ్మం :** కాంగ్రెస్ హాయంలోనే పేదల సొంతింటి కల నెరవేరుతుందని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు అన్నారు. మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు శుక్రవారం మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం మాయమాటలతో పబ్బం గడిపిందని అన్నారు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు శర వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సి.హెచ్. శివ, కాంగ్రెస్ నాయకులు మామిడి వెంకన్న, జెర్రిపోతుల సత్యనారాయణ, కుక్కల హనుమంతరావు, మోర మలయ్య కడియాల నరేష్,మోర మల్లయ్య, సుభాన్, ఐతనబోయిన శ్రీను, కొండబాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ పట్టివేత



**ప్రజాపక్షం/ ఖమ్మం :** అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని రూరల్ పోలీసులు దాడి చేసి పట్టుకున్న సంఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి. అక్రమంగా రేషన్ బియ్యం తరలుతున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు మండల వ్యాప్తంగా మధిర రూరల్ ఎస్సై లక్ష్మీ భార్గవి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మండల పరిధిలోని మాటూరు గ్రామంలో ఒక ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 5.8 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ట్రాక్టర్‌ను, బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సంబంధిత నిందితులపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మధిర పట్టణం బంజారాకాలనీ 8 వార్డులో నివాసముంటున్న మేకల వెంకటేష్ భార్య సీత(38) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. పొట్ట కూటి కోసం చిత్తు కాగితాలు వేరుకుని జీవనం సాగిస్తున్న క్రమంలో శుక్రవారం ఇల్లెందు వెళ్లగా అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మేకల సీత మృతి చెందగా మిగిలినవారికి తీవ్ర గాయాలు అవడంతో ఆసుపత్రికి తరలించారు. దీంతో మేకల సీత కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి.

## నాయుడుపేటలో బడిబాట కార్యక్రమం

**ప్రజాపక్షం/ఖమ్మం :** మండలంలోని ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని నాయుడుపేటలో బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. దీనికి జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ సత్య నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యి, కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేపించారు. అలాగే ఆరెకోడు అంగన్వాడీకేంద్రం ఆధ్వర్యంలో సైతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### నియోజకవర్గ ప్రజల హృదయాల్లో

# చెరగని ముద్ర వేసుకున్న మదన్‌లాల్

-మదన్‌లాల్ సేవలు మరువలేనివి
-వైరాలో మదన్‌లాల్ సంతాప సభ
-పాల్గొన్న కొండబాల, కూరాకుల నాగభూషణం
-కంటతడి పెట్టిన నాయకులు











**ప్రజాపక్షం/వైరా:** వైరా మాజీ శాసనసభ్యులు బానోతు మదన్‌లాల్ అకాల మరణం పట్ల బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన వైరా రింగు రోడ్డు సెంటర్ ఇండోర్ స్టేడియం ఆవరణలో సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మదన్‌లాల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తొలుత ఖమ్మం డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి రాజకీయాల పట్ల ఆకర్షితుడై ఎంపిటిసి నుంచి సర్పంచ్‌గా వైరా నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజల్లో అనునిత్యం ప్రతిపక్షం గాని అధికారపక్షం గాని తనదైన శైలిలో పనిచేశారని వైరా నియోజకవర్గంలో అభివృద్ధి అంటేనే మదన్‌లాల్ అని గుర్తు చేశారన్నారు. మరణం తర్వాత కూడా ఆయన సంతాప సభలను వైరా నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించడం అభిమానుల అభిమానిని, అభిమానులను సంపాదించుకోవడం కూడా చాలా అరుదని అన్నారు. వైరా నియోజకవర్గంలో అలాంటి నాయకుడు పుట్టడం అరరుదని కొండబాల అన్నారు. సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ బానోతు మదన్‌లాల్ మరణం తీరని లోటు, పార్టీ ఏదైనా ఎవరు వెళ్లిన ఎలాంటి పని అయినా చేశాడని గుర్తు చేశారు. సిపిఐ పట్టణ కార్యదర్శి మిట్టపల్లి రాఘవరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఓ మంచి నాయకుడిని కోల్పోయామని పని అంటే ఏమిటి ఎవరు ఏమి అని అడగకుండా ఆ పనిచేసిన నాయకుడు మదన్ అని ఆయన అన్నారు. అనంతరం వివిధపార్టీలకు చెందిన నాయకులు మాట్లాడుతూ చివరి ప్రాణం పోయే వరకు కూడా నియోజకవర్గ ప్రజల కోసం పనిచేశాడని ఆయన మరణం ఈ విధంగా వస్తుందని ఎవరు ఊహించలేదని అన్నారు. మంచితనానికి మారుపేరు మదన్‌లాల్ అని గుర్తు చేశారు. బొంతు సమతతో పాటు పలువురు మాట్లాడుతూ కంటతడి పెట్టారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీ నాయకులు సిపిఎం వైరా నియోజకవర్గ కార్యదర్శి భూక్యా వీరభద్రం, వైరా మాజీ ఎంపిపిలు కట్టా కృష్ణార్జున్‌రావు, బొంతు సమత, వైరా మాజీ మున్సిపాల్ వైస్ చైర్మన్ ముళ్ళపాఇ సీతారాములు, కిలారి కిరణ్, గుమ్మా రోశయ్య, కామినేని శ్రీనివాసరావు, మాదినేని దుర్గాప్రసాద్, మాజీ కౌన్సిలర్లు మాదినేని సునీత, దారెల్లి పవిత్రకుమారి, తడికమళ్ళ నాగేశ్వరరావు, పాముల వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపిపి తన్నీరు జ్యోతి, మహిళా అధ్యక్షురాలు సక్కుబాయి, వైరా పట్టణ అధ్యక్షులు మద్దెల రవి, బట్టా భద్రయ్య, తన్నీరు నాగేశ్వరరావు, వజినేపల్లి చక్రవర్తి, చింత నిప్పు మురళి, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, షేక్ పాషా, నూకల ప్రసాద్, కారుకొండ బోస్, పారుపల్లి నాగం, గుజ్జర్లపూడి దేవరాజ్, ఆదూరి ప్రేమ్, విలాసాగరం నరేష్, విలాసాగరం వెంకటేశ్వరరావు, వీరబాబు, మోటపోతుల సురేష్, తన్నీరు కిషోర్, రంగా సత్యనారాయణ, నల్లగొండ నాని, మడిపల్లి కృష్ణ, పుప్పాల అనంతరామయ్య, అయినాల కనకరత్నం, దొంతబోయిన వెంకటనారాయణ, ఓంకార్ యాదవ్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి

అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



**ప్రజాపక్షం/వైరా:** వైరా తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న గంధం అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ కాంగ్రేస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మున్సిపాల్ కమీషనర్ వేణు పర్యటించారు. డ్రైనేజీ కాల్వలు అస్తవ్యస్థంగా ఉండటంతో స్థానికులు డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. సమస్యలు విన్న ఎమ్మెల్యే మున్సిపాల్ కమీషనర్‌తో కలిసి గంధం టవర్స్ ప్రాంతాల్లో డ్రైనేజీలను పరిశీలించారు. డ్రైనేజీ సమస్య అస్తవ్యస్తంగా ఉన్న పరిస్థితి చూసి డ్రైనేజీ సమస్యలు వెంటనే పరిష్కరించాలని మున్సిపాల్ కమీషనర్ వేణును మున్సిపాలిటీ ఇంజనీరింగ్ సిబ్బందిని కోరారు. మున్సిపాలిటీలో ఉన్న డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గత సంవత్సర కాలంగా గంధం టవర్స్ ఎదురుగా ప్రధాన రహదారిపై నుండి మురుగునీరు ప్రవహించడం వలన ప్రధాన రహదారిపై వెళుతున్న ప్రయాణీకులకు మురుగునీరు దుర్వాసనతో ఇబ్బందులు గురవుతున్నారని సమస్యలను వెంటనే పరిష్కరించాలని కొత్త డ్రైనేజీ నిర్మించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపాల్ మాజీ చైర్మన్ జైపాల్, పమ్మి అశోక్, చెరుకూరి చలపతి, ఫణితి శ్రీను, మద్దినేని రామారావు, మున్సిపాలిటీ సిబ్బంది, మండల అధికారులు పాల్గొన్నారు.

## భూ భారతితో భూ సమస్యలు పరిష్కారం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** భూ భారతి చట్టంతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఖమ్మం డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల చిన్నవెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని బూడిదంపాడు గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆత్మ చైర్మన్ దిరిశాల చిన్నవెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణి చట్టం వల్ల ప్రజలు, రైతులు భూ సమస్యలు పరిష్కారం కాక తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి స్థానంలో భూ భారతి చట్టాన్ని తీసుకు వచ్చి భూ సమస్యలను పరిష్కరించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. బూడిదంపాడు గ్రామంలో నిర్వహించన సభలో తహసీల్దార్ శ్వేత, ఆర్ఐ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు. 62 మంది దరఖాస్తులు అందజేశారు. కోటపాడులో జరిగిన సదస్సులో 66 దరఖాస్తులు రాగా డిప్యూటీ తహసీల్దార్ మురళీధర్‌రావు, ఆర్ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు. ఖమ్మం నగర పరిధిలోని బల్లేపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ సైదులు, ఆర్ఐ సాయి నరేష్, కార్పొరేటర్ లకావత్ సైదులు పాల్గొన్నారు. భూ సమస్యలకు సంబంధించి 13 మంది దరఖాస్తు చేశారు.

## 14న సిపిఐ మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మంజిల్లా మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు ఈనెల 14న మధిరలో జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవి ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 19, 20 తేదీల్లో సిపిఐ మహాసభలు మధిరలో జరగనున్న నేపథ్యంలో ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆహ్వాన సంఘ సమావేశానికి సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి తో పాటు మధిర పట్టణంలోని ప్రముఖులు, పార్టీ బాధ్యులు హాజరుకానున్నట్లు రవికుమార్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

### -పలువురికి గాయాలు

**ప్రజాపక్షం/ఖమ్మం :** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన కొణిజర్లలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ గుగులోత్ సూరజ్ తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం ఉదయం ఖమ్మం వైపు నుంచి వస్తున్న స్కూటి వాహనాన్ని ఖమ్మం వైపు నుంచి వస్తున్న ఆయిల్ ట్యాంకర్ వెనక నుంచి ఢీకొనగా ద్విచక్ర వాహనంపై ఉన్న ఏదులాపురంకు చెందిన వెల్పుల వెంకన్న (50) తలకు బలమైన గాయాలయ్యాయి. 108 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందారు. వెంకన్న భార్య కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

**ఆర్టీసి బస్సు టిప్పర్ ఢీ :**

వైరా నుంచి ఖమ్మం వస్తున్న మణుగూరు డిపో ఆర్టిసి బస్సు ముందు వెళ్తున్న టిప్పర్‌ను ఢీకొనగా బస్సు అద్దాలు పగిలి బస్సులోని ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రయాణికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసలు కేసు నమోదు చేసిదర్యాప్తు చేపట్టారు.

**ఆర్టీసి బస్సు క్రేన్ ఢీ :**

ఖమ్మం నుంచి భద్రాచలం వెళ్తున్న ఆర్టిసి లహరి బస్సును కొణిజర్ల సెంటర్‌లో జేసిబి క్రేన్ డ్రైవర్ ఎటువంటి సిగ్నల్ ఇవ్వకుండా ఒక్కసారిగా ముందుకు రావడంతో క్రేన్ ముందు భాగం బస్సుకు తగిలి బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి. క్రేన్ ఒక్కసారిగా పక్కకు ఒరిగిపోవడంతో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో క్రేన్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

## భూభారతి రెవెన్యూ సదస్సు పరిశీలన



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మంరూరల్ మండలంలోని ఆరెకోడులో నిర్వహిస్తున్న భూభారతి రెవిన్యూ సదస్సును ఆర్డీఓ నర్సింహారావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఓ రైతు వద్ద నుంచి స్వయంగా ధరఖాస్తును స్వీకరించారు. అనంతరం రైతుల సమస్యలను అధికారులు ఏ విధంగా పొందు పరుచుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. అలాగే రైతులతో మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి భూభారతిలో ఉన్న సౌలభ్యాలను వివరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ...ప్రభత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రైతులకు ఎటువంటి సమస్య లేకుండా ఫిర్యాదులను స్వీకరించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ రవిందర్, ఆర్ఐ ప్రసాద్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మదన్‌లాల్ పేరు చెబుతూ కంటతడి పెట్టిన మాజీ ఎంపిపి బొంతు సమత

### ఎక్కడ నెగ్గాలో ఎక్కడ తగ్గాలో తెలిసిన నాయకుడు మదన్‌లాల్




**ప్రజాపక్షం/వైరా:** వైరాలో రింగు రోడ్డు వద్ద జరిగిన మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ సంతాప సభలో పాల్గొన్న మాజీ ఎంపిపి బొంతు సమత సంతాప సభలో మాట్లాడుతూ మదన్‌లాల్ మరణించడం అంటూనే బోరున ఏడ్చారు. కంటిలో నీరు ఆపుకోలేక బాధతోనే మాట్లాడుతూ కంటిలో నీరు ఆపుకోలేక బాధతోనే మాట్లాడుతూ తాను ఎంపిపిగా ఉన్న సమయంలో రాజకీయాలకు అతీతంగా తమకు అండగా నిలిచాడని ఒక మంచి సోదరుని నేను కోల్పోయాను అని అన్నారు. ప్రతి రక్షాబంధన్‌కు రాఖీ కట్టానని అలాంటి మదన్‌లాల్ మరణం మమ్ముల్ని ఎంతో కుమిలిపోయేలా చేసిందన్నారు. మండల అభివృద్ధిలో అన్ని విధాల సహకరించారు. ఎక్కడ తగ్గాలో ఎక్కడ తగ్గారు ఎక్కడ నెగ్గాలో అక్కడ నెగ్గాడు. ఏ మూలన నియోజకవర్గంలోకి వెళ్లిన ప్రతి గ్రామంలో పేరుపేరునా పెట్టి పిలిచే గొప్ప నాయకుడు మదన్‌లాల్ అని అలాంటి మదన్‌లాల్ సంతాప సభలో పాల్గొనడం నాకు చాలా బాధాకరమైన తెలిపారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని అన్నారు.

## ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆదివారం కల్లూరులో మధిర రోడ్డులోని డిఎన్‌పి ఫంక్షన్ హాల్ నందు నూతన అధ్యక్షులుగా పసుమర్తి సీతాచంద్రరావు ప్రమాణస్వీకారం చేస్తారని, ఈ ప్రమాణ స్వీకారం మహోత్సవానికి రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో జరిగే ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభను జయప్రదం చేయాలని ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ ఉపాధ్యక్షులు గ్రంధి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కల్లూరులో జరిగే నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ కల్వ సుజాత గుప్తా, జిల్లా నాయకులు రాష్ట్రనాయకులు మరి కొంతమంది ముఖ్య అతిధులు కార్యక్రమానికి హాజరవుతున్నారని అన్నారు. ఈ మహాసభలో ఖమ్మం జిల్లాలోని ఆర్య వైశ్య సోదరీసోదరీమణులు అందరూ పాల్గొని ఆర్యవైశ్యుల యొక్క ఐక్యతను చాటాలని రాబోయే రోజుల్లో ఆర్యవైశ్యులు రాజకీయాల్లోను సేవారంగాల్లోను తమ యొక్క ప్రత్యేకతను చాటాలని ప్రవీణ్ కుమార్ తెలిపారు.